


# నేనే చంపాను!

అర్ధరాత్రి నగరం అంతా నిద్రపోతోంది. ఒక్క మూన్ లైట్ క్లబ్ తప్ప.

పేరుకు తగ్గట్టుగానే అది రాత్రిపూట, చంద్రుడు ఆకాశంలో కన పడే సమయంలో మాత్రమే తెరచి వుంటుంది. ఉదయం మూసివేయబడి వుంటుంది. శనివారంనాడు ఆ క్లబ్ లో సందడి అధికంగా ఉంటుంది మామూలు రాత్రులుకన్నా.

మూన్ లైట్ క్లబ్ లో పేకాట టేబిల్ ముందు కూర్చున్న కాంభోజ రావు చేతి గడియారం వంక చూసుకున్నాడు.

రెండూ నలభై దాటింది.

సిగరెట్ ఆఖరిసారిగా పీల్చి యాష్ ట్రేలో పడేసి, అప్పుడే ఎదుటి అతను పంచిన ముక్కలు అందుకున్నాడు. ముక్కలు చకచకా రెండు క్షణాల్లో అమర్చేశాడు.

మిగతా ముగ్గురు ముక్కలు చూసుకున్నారు. అందరి మొహాల వంక పరిశీలనగా చూశాడు కాంభోజరావు. ఎలాంటి భావాలు లేవు ఎవరి మొహాల్లో.

ఎదుటివాడి మొహంలోకి చూసి వాడి చేతులలో ఏ ముక్కలు వున్నాయో గ్రహించగలరు కొందరు. అందుకని ముక్కలని చూశాక తమలో కలిగే భావాలని ముఖంమీదకు రానివ్వరు పేకాట బాగా ఆడటం తెలిసినవాళ్ళు.

ఆట పావుగంట తిరిగిన తరువాత, ప్రక్క అతను వేసిన ముక్కని చూశాడు కాంభోజరావు.

ఇస్పేట్ రాజు.

దానికొసమే ఇందాకటినుంచి చూస్తున్నాడు. నవ్వుతూ ఆ ముక్క చేతిలోకి తీసుకున్నాడు.

ఆట అయిపోయింది.

ఒక ముక్క బోర్లావేసి, చేతిలోని సెట్స్ క్రిందపరిచాడు కాంభోజ రావు

కాంభోజరావుతో ఆడుతున్న ముగ్గురూ క్రిందవున్న సెట్స్‌వంక చూశారు నిస్పృహగా.

"ఇంకో ఆట తిరుగుతే నేనే డిక్లేర్ చేసేవాడ్ని" అన్నాడు కాంభోజరావు కుడిప్రక్క కూర్చున్నతను తన చేతిలోని ముక్కలు క్రింద పడేస్తూ.

"ఈసారి ముక్కలు సరిగా కలవలేదు నాకు. పంచినవాళ్ళ చెయ్యి మంచిదికాదు." అన్నాడు ఎడమప్రక్క కూర్చున్నతను కోపంగా.

చిన్నగా నవ్వాడు కాంభోజరావు.
"ఈ ఆటలో ముక్కలు పంచింది నువ్వే" అన్నాడు.

కాంభోజరావుకి ఎదురుగా కూర్చున్నతను ఏం మాట్లాడలేదు. మౌనంగా తన ముందున్న పదిరూపాయలనోటు కాంభోజరాజు వైపు తోశాడు, అయిష్టంగా. అప్పటికే యాభై రూపాయలు పోగొట్టుకున్నాడు అతను. ఒక్క ఆటలోకూడా గెలవలేదు

కాంభోజరావు అందరూ తనవైపు తోసిన డబ్బు లెక్కపెట్టి, జేబులో పెట్టుకుని ఆవలించాడు.

పేకముక్కలు మళ్ళీ కలుపుతున్నతనివంకచూసి "నిద్రవస్తోంది. ఇంకలేద్దాం" అన్నాడు కాంభోజరావు.

మిగతా ముగ్గురూ చేతి గడియారాలవంక చూసుకున్నారు.

"అరె! మూడున్నర అవుతోంది అప్పుడే. ఇవాళ రాత్రి తొమ్మిది గంటలకి రైలులో ఎక్కించాలి, కారు తీసుకుని ఆఫీసునుంచి నేరుగా రమ్మని చెప్పింది నా మిసెస్ మర్చిపోయాను" అన్నాడు కాంభోజరావు ఎదురుగా కూర్చున్నతను.

మందహాసం చేశాడు కాంభోజరావు.

"ఒక్కొక్కరోజు ఒక్కొక్కరి అదృష్టం బాగుంటుంది. ఇవాళ నాది బాగుంది. ఇంక్రిమెంట్ వచ్చిందన్న వార్త ఇవాళ ఉదయమే తెలిసింది. ఇక్కడా అదృష్టం వచ్చింది. ట్రై యువర్ లక్ నెక్స్ట్ టైమ్" అన్నాడు.

"గుడ్. అయితే డ్రింక్సుకి ఆర్డర్ యివ్వండి. లెటజ్ హేవ్ ఎనదరు రౌండ్ అఫ్ డ్రింక్సు."

కుర్చీకి వేలాడుతున్న కోటు అందుకుని తొడుక్కున్నాడు కాంభోజరావు.

"తప్పకుండా కాని ఇవాళకాదు. ఇంకోసారి" టైనాట్ బిగించుకుని లేచాడు.

"అప్పుడే వెళ్ళిపోతున్నారా?" అడిగారు ప్రక్క టేబుల్సుమీద కూర్చుని ఆడుతున్నవాళ్ళు.

"ఇంకా స్సేపయితే పూర్తిగా తెల్లవారిపోతుంది. ఈ ఆటలోపడితే టైం తెలియదు." అన్నాడు కాంభోజరావు నవ్వి.

కాంభోజరావు క్లబ్‌లోంచి బయటకు వచ్చి పార్కింగ్ లాట్‌లో ఆగివున్న స్టుడీబేకర్ తలుపు తెరచి, డ్రైవింగ్ సీటులో కూర్చుని తలుపు మూసాడు. డేష్ బోర్డులోంచి సిగరెట్ టిన్ తీసి, సిగరెట్ వెలిగించి కారు స్టార్టుచేశాడు.

ముందుకు పరుగెత్తింది కారు.

క్లబ్‌నుంచి కాంభోజరావు ఇంటికి దాదాపుగా పదిహేను మైళ్ళ

దూరం ఉంటుంది. అర్ధరాత్రి దాటింది గాబట్టి రోడ్డు మీద జనసంచారం గానీ, మరేమీ లేదు. ఎదురుగా సిమెంట్ రోడ్ ఖాళీగా ఉంది ఆహ్వానిస్తూ. ఎక్సిలేటర్ నొక్కాడు కాంభోజరావు బలంగా. అరవైనుంచి డెబ్బై మైళ్ళకి మారింది స్పీడ్.

ఉదయం పూటయితే జనసమ్మర్దంగా ఉన్నప్పుడు పోలీసు కానిస్టేబుల్స్ వున్నప్పుడు, అంత వేగంగా వెళ్ళటం కుదరదు. అందుకని ఆవకాశం వచ్చినపుడు రాత్రుళ్ళు కాంభోజరావు స్పీడుగా పోనిస్తాడు కారు.

కాంభోజరావు అమెరికన్ కొలాబరేషన్‌తో స్థాపించిన ఓ మందుల కంపెనీలో జనరల్ మేనేజర్, ఏడేళ్ళగా. కారు కంపెనీదే. ఇష్టం లేకపోయినా ఉద్యోగరీత్యా క్లబ్‌లో మెంబర్ కావలసి వచ్చింది.

ఆ క్లబ్ మెంబర్స్ అందరూ వ్యాపారస్తులే కాబట్టి. తన కంపెనీ పనులు చాలావరకు తేలికగా చేయవచ్చు. వాళ్ళతో స్నేహం పెంపొందించుకుంటే.

క్లబ్‌లో చేరిన దగ్గరనుంచి పేకాట ప్రారంభం అయింది కాంభోజరావుకి.

పేకాటలో పెద్దగా ఆర్జన వుండదూ, నష్టమూ ఉండదు. నెలాఖరుకు లెక్క చూసుకుంటే తను పోగొట్టుకున్నదీ, గెల్చుకున్నదీ దాదాపు సమానంగా ఉంటాయి. పేకాటలో డబ్బుపోతుందనే భయం వుండదు శనివారం రాత్రి నిద్ర వుండదు.

కారు వేగంగా వెడుతోంది. కిటికీలోంచి చల్లగాలివస్తోంది రివ్వున.

క్రిందటిరోజు తను స్టెనో పోస్టులకు ఇంటర్వ్యూ చేసిన నలుగురిని గురించి ఆలోచిస్తున్నాడు కాంభోజరావు, ఎవరిని సెలెక్ట్ చెయ్యాలా అని. అందరూ మంచి అనుభవం కలవాళ్ళే అవటంతో, ఎవరిని సెలెక్ట్ చెయ్యాలో తెగటంలేదు. సిగరెట్ బయటికి విసిరేశాడు.

రియర్ విండ్ స్క్రీన్‌లోంచి రోడ్డుమీదకి చూశాడు.

తెల్లటి ఆకారం రోడ్డుకి ఎడమప్రక్కన నిలబడి చెయ్యి వూపు తున్నాడు కారు ఆపమన్నట్లుగా.

కారు కొంచెం ముందుకు వెళ్ళాక పరీక్షగా చూశాడు. తెల్లటి బట్టల్లో ఉన్నాడు మొగాడు. ఎడంకాలికి బాండేజ్.

కుడిచెయ్యి ఊపుతున్నాడు అతను ఆపమన్నట్లుగా.

హారన్ కొట్టాడు కాంభోజరావు గట్టిగా. వెంటనే స్పీడు పెంచాడు హారన్‌మీదనుంచి చెయ్యి తియ్యలేదు. అర్ధరాత్రి సినిమా చూసి బస్సులు దొరక్కలిఫ్టు అడగటం చాలామందికి అలవాటు.

దొంగకూడా అయివుండవచ్చునని అనుమానం కలిగింది. లిఫ్టు అడుగుతున్నారని కారు ఆపగానే, కత్తి చూపించి, బెదిరించి దోచు కుంటారు దొంగలు. ఒక్కొక్కసారి అదృష్టం బాగుండకపోతే, కారుతో సహా ఇంటికి నడిచే వెళ్ళాలి.

హారన్ చప్పుడుకి, కారు వేగానికి ప్రక్కకు తప్పుకుంటాడను కున్నాడు కాంభోజరావు. కాని ప్రక్కకి తప్పుకోలేదతను. అడ్డంగా నడిచి వచ్చాడు రోడ్డుమీదకి త్వరత్వరగా, కారు ఆపమని చేయివూపుతూ.

అలా కారుకి అడ్డంగా రోడ్డుమీదకి వస్తాడనుకోలేదు కాంభోజ రావు. అందుకు సిద్ధంగాలేడు కారుకి అడ్డంగా వున్న అతన్ని చూసి బ్రేకు వేశాడు వెంటనే చటుక్కున. కాని అప్పటికే సమయం మించి పోయింది.

కారుకి అడ్డంగావున్న అతన్ని కారు గుద్దుకోవటం కారు హెడ్ లైట్‌లో రియర్ విండ్‌స్క్రీన్‌లోంచి చూశాడు కాంభోజరావు. ఎగిరి పడ్డాడు అతను అరుస్తూ. స్టుడిబేకర్ ముందు చక్రాలు రెండూ అతని శరీరంమీదకి ఎక్కటం కుదుపువల్ల తెలుసుకోగలిగాడు కాంభోజరావు.

హారన్‌మీదనుంచి చెయ్యితీసి కంగారుగా కారు తలుపు తెరచి క్రిందకి దిగి చూశాడు.

కారు హెడ్‌లైట్స్ వెలుగులో స్పష్టంగా కనబడుతున్నాడు. కారు క్రింద పడివున్న వ్యక్తి గిలగిలా కొట్టుకుంటూ.

రెండు చక్రాలు పొట్టమీద, కాళ్ళమీద ఎక్కివున్నాయి. రక్తం కారుతోంది పొట్టలోంచి. కాళ్ళకి కట్టివున్న బాండేజ్ తెల్లగాలేదు ఇప్పుడు ఎర్రగా వుంది రక్తంతో తడిసి.

భయంగా చూశాడు కాంభోజరావు అటూ ఇటూ రోడ్డుకి రెండు వైపులా. ఎవరూలేరు. వేరేకార్లు ఏమీ రావటంలేదు.

క్రింద తన కారు చక్రాలక్రింద పడివున్నతన్ని చూశాడు.

గిలగిలా కొట్టుకోవటంలేదు ఇప్పుడు. కదలకుండా నిశ్చలంగా పడివున్నాడు ప్రాణం పోయిందని గ్రహించాడు కాంభోజరావు వెంటనే.

కాళ్ళలోంచి వణుకు పుట్టుకు వస్తోంది. కాంభోజరావుకి. ఆలస్యం చెయ్యకుండా కారుయెక్కి కూర్చుని స్టార్టుచేసి పదిగజాలు వెనక్కి పోనిచ్చాడు రివర్స్‌లో.

రోడ్డుమీదకి చూశాడు ఆపి. కట్టెలాగ పడివున్నాడు అతను. కదలకుండా స్టుడీబేకర్ పెద్దకారు, హెరాల్డు లాగాకాదు దానిక్రింద పడితే బ్రతకటం కష్టం.

గేర్ మార్చి కారు అతని ప్రక్కనుంచి ముందుకి పోనిచ్చాడు.

పది నిముషాల్లో ఇంటికి చేరుకున్నాడు. కారుదిగి తాళంతీసి కారు షెడ్ తలుపులు తెరిచాడు. కారు షెడ్‌లో పెట్టి, ముందు చక్రాల దగ్గర మోకాళ్ళమీద కూర్చుని పరీక్షగా చూశాడు టైర్లకి, ప్లేటుకి రక్తం అంటుకునేవుంది. ఎర్రగా, చిక్కగా. షెడ్ తలుపు మూసి ఇంట్లోకి వెళ్ళాడు.

ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటున్న భర్తని చూసి అడిగింది కాంభోజరావు భార్య.

"అలా వున్నారేం?" దేనికి కంగారుపడుతున్నారు?"

"ఏంలేదు" అన్నాడు కాంభోజరావు.

"భోజనం సిద్ధంగావుంది వడ్డించనా?" అడిగింది భర్తని.

"వద్దు నాకు ఆకలిగాలేదు"

కాంబోజరావువంక చూసింది అతని భార్య విచిత్రంగా. ప్రతి శని వారం ఎంత ఆలస్యమయినా తప్పకుండావచ్చి, ఇంట్లోనే బోజనంచేస్తాడు కాంబోజరావు బయట ఎప్పుడూ తినడు.

కోటు విప్పి మూలకి విసిరేశాడు బూట్లువిప్పి మేజోళ్ళతోనే పక్కమీదకి వాలిపోయాడు

తను ఇంటర్వ్యూ చేసిన నలుగురు గురించే ఆలోచించడంలేదు యిప్పుడు. తను డ్రైవ్ చేస్తున్న కారుక్రింద పడి అస్సహాయంగా మర ణించినతన్ని గురించి ఆలోచిస్తున్నాడు.

ఈపాటికి ఆ దారిన వెళ్ళేవాళ్ళు చూసివుంటారు అతన్ని. పోలీసు లకి రిపోర్టు ఇస్తారు. ఎవరి కారుక్రిందపడి మరణించాడో తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు పోలీసులు.

తన కారుక్రింద పడి మరణించాడని పోలీసులు ఆచూకీ తీయగలి గితే? తను పట్టుబడితే? తనని పట్టుకోగలరా?

ఆ ఏక్సిడెంటు జరిగినప్పుడు ఎవరూలేరు చుట్టుప్రక్కల. తన ఆచూకీ ఎలా తీయగలరు? తన కారు క్రిందే పడి మరణించాడని చెప్పే వాళ్ళుగాని, సాక్ష్యం ఇచ్చేవాళ్ళుగాని ఎవరూ లేరుగా. కాబట్టి తను పట్టు బడడు అంత తేలికగా.

అయినా పోలీసులు ఎలాగయినా తనని పట్టుకోగలిగితే?

"ఏం జరిగింది?" అడిగింది కాంబోజరావు భార్య. భర్త ముఖం లోకి చూస్తూ లాలనగా.

"ఏంలేదు" అన్నాడు పొడిగా.

"మీరు చెప్పడంలేదు. నిజంగా ఏదో జరిగింది"

"ఏదో జరిగిందని నీకెలా తెలుసు?"

"మీ మొహం చూస్తుంటేనే తెలిసిపోతుంది. ఎందుకు అంతభయ పడుతున్నారు?" అడిగింది ప్రేమగా.

కొన్ని క్షణాలు ఆలోచించాడు కాంబోజరావు చెప్పాలా, వద్దాఅని. చెప్పడానికే నిర్ణయించుకున్నాడు. జరిగింది చెప్పటమే మంచిది. ఎలా గోలా పోలీసులు తనని పట్టుకుంటే అప్పుడయినా తెలిసిపోతుంది. ఒక వేళ పోలీసులు కనుక్కో-లేకపోయినా చెప్పటమే మంచిది, ముందు జాగ్రత్తకోసం. చెబితే వచ్చే నష్టంలేదు.

"ఇందాక క్లబ్‌నుంచి వస్తుంటే ఏక్సిడెంట్ అయ్యింది" చెప్పాడు.

"ఏక్సిడెంటా? మీకు దెబ్బలేం తగల్లేదుకదా? మరి యింతసేపు చెప్పకుండా బెల్లం కొట్టిన రాయిలాగా కూర్చున్నారేం?" అడిగింది కాంబోజరావు భార్య కంగారుగా.

"నాకేం దెబ్బలు తగలలేదు"

"కారుకా?"

"కాదు. మనిషికి"

"మనిషా?"

"అవును. ఎవడో కారుక్రింద పడ్డాడు"

"అయ్యోపాపం! ఎలా వున్నాడు? హాస్పిటల్లో చేర్పించారా వెంటనే."

"లేదు."

"అట్టే దెబ్బలు తగలలేదా?"

గుటకలు మింగాడు కాంబోజరావు. "చచ్చిపోయాడు" చెప్పాడు నెమ్మదిగా.

"నిజంగా?" కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది ఆవిడ.

"అవును నిజంగానే"

"వెంటనే చచ్చిపోయాడా?"

"కారు చక్రాలు పొట్టమీదకి, కాళ్ళమీదకి ఎక్కాయి. హారన్ కొడుతున్నా వినిపించుకోకుండా కారుకి అడ్డంగా వచ్చాడు. రెండు మూడు నిముషాల్లో చచ్చిపోయాడు వెంటనే. పాతిక ముప్పై ఏళ్ళుండవచ్చు. ముసలివాడుకాదు పడుచువాడే ఎడంకాలికి బాండేజ్ కట్టివుంది.

"బహుశ ఇదివరకే ఒకసారి ఏక్సిడెంట్ అయి వుండొచ్చు ఇలాగే. ఇవ్వాళ రెండోసారేమో మరీ అంత నిర్లక్ష్యంగా కారుకి అడ్డంగా రావటం దేనికి?"

కాంబోజరావు మాట్లాడలేదు. దిగులుగా చూస్తూండి పోయాడు. "ఎక్కడ జరిగింది?" అడిగింది కాంబోజరావు భార్య భర్తని.

"లైబ్రరీ ఎదురుగా"

"పోలీసులకి రిపోర్టు యిచ్చారా?" అడిగింది కాస్సేపాగి.

"లేదు"

"ఏం?"

"వద్దు"

"రేపు పోలీసులకితెలిస్తే ఏంకాదుగా?" అడిగింది అనుమానంగా.

"ఫరవాలేదు. మన అదృష్టం కొద్దీ ఎవరూ లేరు అక్కడ ఆసమయంలో ఎవరూ చూడలేదు."

"పోలీసులు ఎలాగయిన కనుక్కోగలిగితే? వాసనచూసి పసికట్టే కుక్కలుంటాయిట కదా వాళ్ళ దగ్గర!" అడిగింది.

"అవును. వుంటాయి." అన్నాడు కాంబోజరావు.

కొన్ని నిమిషాలు ఆలోచించి అన్నాడు "ఏక్సిడెంట్ సంగతి నేను నీకు ఇంటికి రాగానే చెప్పాను. మర్నాడు గుర్తు చేయ్యమన్నాను, పోలీసు రిపోర్టు చెయ్యడానికి. నువ్వు గుర్తు చెయ్యటం మర్చిపోయావు. పోలీసులు వచ్చి నిన్నేమయినా అడిగితే, అలా చెప్పాలి నువ్వు తెలిసిందా?"

"పోలీసులు నమ్ముతారా? వెంటనే ఎందుకు రిపోర్టు చెయ్యలేదని అడిగితే?"

"నమ్మినా, నమ్మకపోయినా అదే చెప్పాలి నువ్వు. అంతకంటే మనమేం చెయ్యలేము."

"సరే. ఇంక భోజనం చేద్దురుగాని లేవండి" అన్నది కాంబోజరావు భార్య.

"వద్దు ఆకలిగాలేదు" అన్నాడు కాంబోజరావు.

"తింటే అదే వేస్తుంది. నా మాట విని లేవండి." బలవంతం చేసింది.

కాంబోజరావు మేజోళ్ళు విప్పి లేచాడు.

"పోలీసులకి తెలిస్తే ఏం చేస్తారు?" అడిగింది అన్నం వడ్డిస్తూ.

"చచ్చిపోయిన అతని బంధువులకిగాని, అతని కుటుంబానికి గాని ఏదయినా డబ్బు నష్టపరిహారం క్రింద యిచ్చుకోవాల్సి రావచ్చు. కోర్టుకి వెళ్ళకుండానే ఏదో సెటిల్ చేసుకునే మార్గం చూడాలి. లేకపోతే అందరికి తెలిసిపోతుంది. అమర్యాద, పరువునష్టం" చెప్పాడు.

"ఇంక ఇవాళ రాత్రి నిద్రపట్టదు నాకు. రేపు లేపకు నన్ను బాగా నిద్రపోని" అన్నాడు కాంబోజరావు మజ్జిగ పోసుకుని.

"నేనొక ప్రశ్న అడుగుతాను. మీకు కోపం రాకుండా ఉంటుంది కదా?" అడిగింది భర్త పక్క పడుకుంటూ.

"అడుగు ఏమిటి" అన్నాడు కాంబోజరావు సీలింగ్ వంక చూస్తూ ఇంకా ఆయన మనస్సు సర్దుకోలేదు.

అడగలేదు కాంబోజరావు భార్య. రెండు నిమిషాలు ఆగి "ఏమిటి నీ అనుమానం? అడుగు" అన్నాడు కాంబోజరావు.

"అయితే....ఒకవేళ పోలీసులు పట్టుకుని కోర్టుకి తీసుకువెడితే జైల్లో పెట్టరుగా?"

"పెడతారు కస్టడీలో"

"ఉరి శిక్ష వెయ్యరుగా." అడిగింది బెదురుతూ.

"చాల్లే పడుకో" విసుక్కున్నాడు కాంబోజరావు.

అరగంట దాటినా నిద్ర పట్టడంలేదు కాంబోజరావుకి. మనసులో తన కారు క్రింద పడ్డ ఆ ఆకారం, పోలీసులు, కోర్టు తిరుగుతున్నారు. ఇక పడుకోలేక పోయాడు.

లేచి, భార్య వంక చూసాడు గాఢంగా నిద్రపోతుంది. అలసట ఛాయలు కనబడుతున్నాయి ముఖంమీద. భార్యని లేపబుద్ధికాలేదు కాంబోజ రావుకి.

బట్టలు మార్చుకుని, బయటికి వచ్చాడు నిశ్శబ్దంగా. టార్చిలైట్ వెలిగించి కారు షెడ్‌లోకి వెళ్ళాడు. వంగొని మళ్ళీ ముందరి రెండుటైర్లు పరీక్షగా చూసాడు. ఎర్రగా రక్తం అంటుకుని స్పష్టంగా కనపడుతోంది. భూతద్దం అవసం లేకుండానే.

టార్చిలైట్ వెలుగులోనే, అరగంట శ్రమపడి నీళ్ళతో పూర్తిగా కడిగేసాడు, టైర్లకి అంటుకుని వున్న రక్తం. కారు షెడ్‌లో టైర్లు కడిగిన చాయలు తెలియకుండా వుండాలి. పొడిగుడ్డతో నేలమీద వున్న నీళ్ళని పూర్తిగా తుడిచేసాడు. పావుగంటలో నీళ్ళు ఆరిపోతాయి. పొడి గుడ్డని మళ్ళీ చక్కగా పంపు దగ్గర జాడించి, పిండి ఆరేసాడు. దాన్ని మాయం చేయాలి లేకపోతే, పోలీసు లేబరెటరీలో దాన్ని పరీక్షించి అక్కడక్కడా కంటికి కనపడకుండా వున్న రక్తపు కణాలు రసాయనిక పద్ధతులలో కనుక్కోగలరు. క్రైమ్ సైన్స్ ఇండియాలో కూడా బాగా అభివృద్ధి చెందింది స్వతంత్రం వచ్చాక. చిన్నగా నవ్వుకున్నాడు తన దూరదృష్టికి.

కారు ముందు నుంచుని చూసాడు టైర్లు నిగనిగ మెరుస్తున్నాయి. నల్లగా, లైట్ కాంతిలో రక్తపు చాయలే లేవు.

కొన్ని క్షణాలు కారు టైర్లువంక చూస్తూ, ఆలోచిస్తూండిపోయాడు. తన పోలీస్ డిటెక్టివ్‌గా భావిస్తూ. ఏ విధంగా కనుక్కోగలరు? వెనకటైర్లు దుమ్ము కొటుకుపోయి వున్నాయి. కాని ముందు టైర్లు, కడిగినట్లు తెలుస్తు

న్నాయి. ఎందుకు కడుగుతారు ముందు టైర్లు మాత్రమే? ఏం సమాధానం చెప్పగలడు ఆ ప్రశ్నకి?

ఎలిబీ కూడా కావాలి తనకి. చాలా అవసరం. అసలు తను ఆ హత్య జరిగిన ప్రాంతాలకే పోలేదు అని నిరూపించుకోవాలి.

ఏ విధంగా ఎలిబీ సంపాదించటం? పోలీసులు తన ఎలిబీని నమ్మే విధంగా వుండాలి. తేలిగ్గా కొన్ని నిముషాలు ఆలోచిస్తూండిపోయాడు.

కారులో ఎక్కి కూర్చుని గేట్ తలుపులు తీసి కారు బయటకు తీసుకు వచ్చాడు. ఇంటిగేటు తలుపులు మళ్ళీమూసి ముందుకిపోనిచ్చాడు కారును. సిగరెట్ తాగుతూ ఆలోచిస్తున్నాడు ఎలిబీ గురించి.

చటుక్కున బ్రేక్ వేసి ఆపాడు కారు. రోడ్డు పక్కనవున్న తారు డబ్బా వంక కొన్ని క్షణాలు ఆలోచనగా చూస్తూండిపోయాడు. తర్వాత ఎదురుగావున్న గాంధీ మహాత్ముడి విగ్రహంవంక చూసాడు పరిశీలనగా.

గుడ్ అయిడియా!

సిగరెట్ ఆర్పి పీక బయట పడేయకుండా కారులోనే పడేసాడు. కారు లైట్లు ఆర్పి కారుదిగి తారు డబ్బా దగ్గరకెళ్ళాడు. పొడుగాటి కర్ర వుంది. రోడ్డు వేయటానికి వుపయోగించే ఆ తారు డబ్బాలో, కర్రనిండా తారు అంటేలాగ కదిపి, ఆ కర్రతో గాంధీవిగ్రహం దగ్గరకి వెళ్ళాడు. గాంధీగారికి తారుతో మీసాలుపెట్టాడు. నామంపెట్టాడు. విగ్రహం క్రింద భాగం అంతా తారు పూసాడు బాగా.

తన బట్టలకికూడా తారు రాసుకుని కర్రదూరంగా విసిరేసి, కారు దగ్గరికి వచ్చి ఆగాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. అర్ధరాత్రి కాబట్టి ఎవరూ లేరు.

కారులో ఎక్కి సరాసరి దగ్గరలోవున్న పోలీస్ స్టేషను ముందు ఆపాడు కారు. లోపలికి వెళ్ళబోయేముందు ఒకసారి కారుటైర్లవంక పరీక్షగా చూసాడు.

కడిగినట్లుగా లేవు. మామూలుగా వున్నాయి. కనుక్కోలేరు ఇప్పుడు.

"ఏమయింది?" అడిగాడు సబ్ ఇన్‌స్పెక్టర్, ఒంటినిండా తారుతో వున్న కాంబోజరావుని చూసి.

"నా పేరు కాంబోజరావు" చెప్పాడు కాంబోజరావు ఆయాసపడుతూ.

"ఏమయింది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ వచ్చే నవ్వు ఆపుకుంటూ.

"నేను మూన్‌లైట్ క్లబ్‌లో మెంబర్ని. రాత్రి ఇంటికి తిరిగి వెళుతూంటే, ఎవరో నలుగురు గాంధీ విగ్రహానికి తారు పూస్తూండటం చూసి, కారు ఆపి దిగివెళ్ళాను వాళ్ళదగ్గరకి. నన్ను చూసికూడా ఆగలేదు వాళ్ళు. నేను ఎందుకు అలా తారు పూస్తున్నారని అడిగాను అంతే. వాళ్ళలో ఒకడు నా మీదకి దూకి ఒంటినిండా తారు పూసాడు. మిగతా ముగ్గురూ నన్ను కదలకుండా పట్టుకున్నారు.

"ఎప్పుడు?"

"చాలా సేపయింది ఇది జరిగి, రెండుగంటలక్రితం అయివుండ వచ్చు.

"తర్వాత?"

"ఇద్దరూ నన్ను కదలకుండా అక్కడ ఆ విగ్రహందగ్గరే కూర్చో పెట్టారు పట్టుకుని. మరో ఇద్దరు నా కారు తీసుకుని ఉడాయించారు."

"కారు పోయిందా?"

"లేదు. వాళ్ళు దొంగలుకారు. స్టూడెంట్సు అనుకుంటాను. తమాషాకోసం రంగు పూసారట గాంధీకి. కారులో సరదాగా తిరిగి మళ్ళీ కారు తీసుకువచ్చి అప్పగించారు."

"తర్వాత?"

నలుగురూ కలిసి వెళ్ళిపోయారు సందులో పడి సరాసరి ఇక్కడికి వస్తున్నాను."

"రిపోర్టు రాసివ్వండి ఈ రోజుల్లో స్టూడెంట్స్ మరీ మితిమీరి పోతున్నారు."

"అలాగే తప్పకుండా వాళ్ళమీద చర్య తీసుకోవాలి మీరు"

"మా ప్రయత్నం మేం చేస్తాం."

"వాళ్ళలో ఒక్కడికే డ్రయివింగ్ వచ్చు" కాంబోజరావు రిపోర్టు రాస్తుంటే టెలిఫోన్ మోగింది. సబ్ ఇన్స్పెక్టరు అందుకుని అంతా విని పెట్టేశాడు. రైటింగ్ పేడ్‌మీద సబ్ ఇన్స్పెక్టరు రాసుకున్న మాటలు ఓరగా చూశాడు కాంబోజరావు రిపోర్టు రాస్తూనే.

"లైబ్రరీ, ఏక్సిడెంట్, ఎడంచేతికి బేండేజ్" మొదలయినమాటలు చదవగానే గుండెలు కొట్టుకున్నాయి ఒక్కమాటు.

"మీరు రిపోర్టు రాసివ్వండి. వేరేపని తగిలింది. వెంటనే వెళ్ళాలి" హడావిడిగా వెళ్ళిపోయాడు సబ్ ఇన్స్పెక్టర్.

* * *

మర్నాడు సాయంత్రం అవుతోంది.

"మిమ్మల్నేనండి లేవండి"

లేవలేదు కాంబోజరావు. మెలకువ రాలేదు అసలు భార్య పిలుపు లకి. తెల్లవారి అయిదున్నరకి తిరిగివచ్చాడు.

"మిమ్మల్నే ఏమండోయ్" తట్టి లేపుతుంది భర్తని.

"ఏమిటి?" అడిగాడు కాంబోజరావు నిద్రమత్తులో.

"నాలుగవుతోంది సాయంత్రం. మరీ అంత మొద్దునిద్రా?" అంది దుప్పటి లాగేస్తూ.

"ఇంకో అరగంట తర్వాత లేస్తాను" అన్నాడు నిద్ర మత్తులోనే, లేవకుండా.

"పనుంది లేవండి"

"లేవలేదు కాంబోజరావు."

"వినిపించుకోరేమిటి లేవండి" అన్నది కోపంగా భర్తని తట్టి లేపుతూ.

"వేరే పనేం లేకపోతే నువ్వుకూడా పోయి పడుకో. నన్ను లేపకు" అరిచాడు కాంబోజరావు.

"మీకు గొప్ప బహుమతి వచ్చింది లేవండి"

"ఎవరు చెప్పారు?" అడిగాడు కళ్ళు తెరవకుండానే.

"పేపర్లో పడ్డది." చేతిలోని ఈవెనింగ్ ఎడిషన్‌తో భర్తను తడుతూ అన్నది కాంబోజరావు భార్య.

వెంటనే లేచి కూర్చున్నాడు కాంబోజరావు మంచంమీదే.

"డి సిరీస్, పదమూడువేల నాలుగువందల అరవై రెండో నెంబర్. అవునా? ఫస్ట్ ప్రయిజా?" అడిగాడు.

"కాదు."

"అయితే సి సిరీస్ పదిహేడువేల ఎనిమిదివందల ఇరవై ఆరో నంబరా? హర్యానా కదూ?"

పకపకా నవ్వింది కాంబోజరావు భార్య "నిద్రలో లేపి అడిగినా లాటరీ టిక్కెట్ నెంబర్లు చెప్పగలరు మీరు లాటరీలో కాదు మీకు ప్రయిజు వచ్చింది"

"మరి దేంట్లో?"

"నిన్న రాత్రి మీరు చేసిన ఘనకార్యానికి" నవ్వింది గర్వంగా.

"ఏం చేశాను?" అన్నాడు ఆలోచిస్తూ.

"లేచి మొహం కడుక్కుని రండి చెపుతాను."

"ముందుచెప్పు"

పేపరు వెనక దాచేసింది.

"నేను చెప్పినట్లు చెయ్యండి మీరు"

"సరే ఇది చెప్పు ఎన్నివేలు?"

"వెయ్యిన్నూట పదహారులు."

"చంపక త్వరగా చెప్పు. ఏమిటా ప్రయిజ్? పేపర్‌లో పడిందా నా పేరు?" అడిగాడు.

"మీరే చదవండి" తెలుగు పేపర్ భర్తకి అందించింది చివరకు.

"ఎక డ?" అడిగాడు పేపరులో చూస్తూ.

కాంభోజరావు కళ్ళు లైన్‌లవెంట పరుగెత్తాయి వేగంగా హంత కుని మరణం" అన్న హెడ్డింగ్ కనబడింది.

"రెండు రోజులుగా పోలీసులని తప్పించుకుని తిరుగుతున్న "కాబూల్" అనే ఓ నేరస్తుడు చేసే అరాచకాలను గురించి పాఠకులు ఇదివరకే చదివి ఉంటారు. ఇండియన్ ఆర్మీలో హవల్దారు ఇతను. ఇతనికి మతిస్థిమితం లేనట్లుగా తెలుస్తూంది. ఉన్మాదస్థితిలో ఉన్న ఇతన్ని మిలటరీ హాస్పటల్లో చేర్చారు. కాని అక్కడనుంచి తప్పించుకొన్నాడు మూడురోజులక్రితం.

ఈ రెండు రోజుల్లో ఇతను పదిహేడేళ్ళ అమ్మాయిని ఇద్దరు ముప్పైఏళ్ళ యువతులని బలవంతంగా అనుభవించి హత్య చేశాడు. వాళ్ళలో ఇంకో యువతి బ్రతికేవుంది. సివిల్ పోలీసులు, మిలటరీ పోలీసులు కాబూల్‌ని పట్టుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు.

నిన్న ఉదయం పదకొండు గంటలకు ఇతని మీద తుపాకి పేల్చడం జరిగింది. కాలికి దెబ్బ తగిలివుండవచ్చని ఊహిస్తున్నారు. కాబూల్ విషయం నగరంలో అందరికి ముఖ్యంగా ఆడవారికి హెచ్చరిక చేయడం జరిగింది. ఇతన్ని పట్టుకున్నవాళ్ళకి వెయ్యిన్నూట పదహార్లు బహుమానం ప్రకటించారు పోలీసు కమీషనర్ నిన్న సాయంత్రం. స్థానిక లయన్స్‌క్లబ్ భరిస్తుంది ఆ బహుమానం.

నిన్న రాత్రి సుమారు మూడుగంటల ప్రాంతంలో కాబూల్ మరణించటం జరిగింది. జిల్లా లైబ్రరీ ఎదురుగా ఓ కారుక్రింద పడి పోలీసులకి అదే దారిన వెడుతున్న ఒకలారీ డ్రయివర్ రిపోర్టు చేయగానే వచ్చి

శవాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు. వెంటనే మరణించింది కాబూల్ అని గుర్తించారు.

కాబూల్ రోడ్డుకి మధ్యగా పడివున్నాడు పోలీసులు చూసినప్పుడు. అంటే ఫుట్‌పాత్ దిగి రోడ్డుకి అడ్డంగా వచ్చాడు కారు వస్తున్నప్పుడు.

కాబూల్ పడివున్న తీరుచూస్తే, కారునడిపినతని తప్పు ఏమాత్రం లేదని కాబూల్‌దే తప్పని తెలుస్తోంది స్పష్టంగా.

కాబూల్ మరణానికి కారకులయిన వాళ్ళు నిర్భయంగా పోలీసు కమీషనర్‌ను కలుసుకుని, లయన్స్ క్లబ్ ప్రకటించిన బహుమతి గ్రహించవచ్చు — అని కమీషనర్ తెలియజేస్తున్నారు.

వారం రోజుల్లో ఆ బహుమానంకోసం ఎవరూ రాకపోతే అది తర్వాత ఎవ్వరికి ఇవ్వబడదు."

ఆ వార్తక్రింద రోడ్డుమీద చచ్చిపడివున్న కాబూల్ ఫోటో పోలీసులు సంపాదించిన ఇతర కాబూల్ ఫోటోలు ప్రచురింపబడ్డాయి.

పూర్తిగా చదివి పేపరు మడిచాడు కాంభోజరావు. అతనికి తల తిరగసాగింది.

"ఏం చేస్తారు ఇప్పుడు?" అడిగింది భర్త మొహంలోకి చూస్తూ.

తనే పొరపాటున హత్య చేశాడని నిరూపించడానికి ఉపయోగించతగిన ఆధారాలన్నీ ఏ విధంగా క్రితంరాత్రి తను తుడిచివేసిందీ వివరించాడు కాంభోజరావు భార్యకు.

"అయ్యో! అయితే ఇప్పుడు పోలీసులకి చెప్పినా నమ్మరు" అన్నది కాంభోజరావు భార్య.

"అవును నిజం చెబితే ఇప్పుడు నమ్మరు.

ఆ బహుమానంకోసం అబద్ధం ఆడుతున్నాననుకుంటారు. ఏక్సిడెంట్ జరిగిన సమయంలో కారు నా దగ్గరలేదని, నిన్న పోలీస్ స్టేషన్‌లో స్వయంగా రాసిచ్చాను. అది వాళ్ళ దగ్గర ఉంది. ఇప్పుడు ఆధారాలను రూపుమాపి ఫాల్స్ ఎలిబీ సృష్టించినందుకు మొదలు జైల్లో పెడతారు ప్రయోజనంలేదు" అన్నాడు కాంభోజరావు దిగులు పడిపోతూ.

(అపరాధ పరిశోధన ఏప్రిల్ 1972)